
బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం

నేటి నుంచి విజయలక్ష్మి ఆలయ బ్రహ్మోత్సవాలు

ఎర్రగడ్డ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని విజయలక్ష్మి దేవాలయంలో నేటి నుంచి 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 10వ తేదీతో ముగియనున్న ఈ వేడుకలకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చిన్న జీయర్ స్వామి మంగళ శాసనములతో ఉత్సవాలు నిర్వహిస్తున్నామని దేవాలయ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, కార్యదర్శి పి.జనార్దన్, కోశాధికారి ఎం.వి.రెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సహస్రనామ స్తోత్ర పారాయణం, విశ్వక్సేనారాధన, రక్షాబంధనం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం మార్చి నెలలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే విజయలక్ష్మి శ్రీనివాస కల్యాణ మహోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ ఏడాది కల్యాణ మహోత్సవాన్ని 8వ తేదీన సాయంత్రం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 10వ తేదీ మహా పూర్ణాహుతి, 108 కలశాలతో క్షీరాభిషేకం, చక్రస్నానం నిర్వహిస్తారు.


చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచుల సంఘం జేఏసీ ప్రతినిధులు

సర్పంచుల సమస్యలను పరిష్కరించాలి

బేగంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, వేతనాల పెంపు సహా పలు సమస్యలపై అంగన్‌వాడీ టీచర్లు.. సర్పంచుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సర్పంచుల సంఘం జేఏసీ ప్రతినిధులు ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యలను కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. కాగా, మంగళవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణికి 401 అర్జీలు వచ్చాయి. చిన్నారెడ్డి, దివ్య అర్జీలను స్వీకరించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలి

పంజాగుట్ట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సాంకేతికత ఎప్పుడూ పురోగతికి దారి చూపుతుందని, టెలికాం రంగం అభివృద్ధి చెందుతున్నట్లే వ్యవసాయ రంగం సైతం అభివృద్ధి చెందాలని రైతు వెల్లంగంరెడ్డి అన్నారు. బీటీ పత్తి తమ జీవితాల్లో విప్లవాత్మక మార్పును తెచ్చిందని, ఆ ప్రయోజనాలను ఇతర పంటలకు కూడా కోరుకుంటున్నామన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన జాతీయ రైతు సాధికారత కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా రుద్రారం గ్రామానికి చెందిన రైతు డి.నారాయణ, రఘునాథపల్లి గ్రామానికి చెందిన రైతు గోపు సోమారెడ్డి, మోటాపురం గ్రామానికి చెందిన అశోక్ కుమార్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. ఇరవై ఏళ్ల క్రితం బీటీ పత్తి ప్రవేశపెట్టినప్పుడు అది భారతదేశ పత్తి వ్యవసాయాన్ని పూర్తిగా మార్చేసిందన్నారు. పురుగు మందుల వినియోగం తగ్గి దిగుబడి పెరిగిందన్నారు. మరో రైతు నారాయణ మాట్లాడుతూ.. ఎప్పుడూ పొలాల్లో అడుగు పెట్టని వాళ్లు తమకు ఏం అవసరమో నిర్ణయించడం అన్యాయమన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న జెక్ కాలనీ మహిళా సంఘం ప్రతినిధులు

జెక్ కాలనీలో మహిళా దినోత్సవం

అమీర్‌పేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లోని జెక్‌కాలనీలో మంగళవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెక్‌కాలనీ మహిళా కమిటీ, కిట్టీ పార్టీ బృందాల ఆధ్వర్యంలో కాలనీలోని రోడ్డు నంబర్ 1లో ఉన్న విజయ గ్రాండియర్ అపార్ట్‌మెంట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ, మహిళా కమిటీల ప్రతినిధులు చింతిరెడ్డి ప్రభ, లంకా హైమావతి, మాధవి, శైలజ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

పంజాగుట్ట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 25వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్ష జరగనుంది. అరగంట ముందే విద్యార్థులు హాల్‌టికెట్‌తో కేంద్రానికి చేరుకోవాలి. అయితే ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఐదు నిమిషాల వరకు ఆలస్యమైనా లోపలికి అనుమతించనున్నారు. పంజాగుట్ట పీఎస్ పరిధిలో అమీర్‌పేట నాగార్జున నగర్‌లోని అక్షర జూనియర్ కాలేజ్, శారద జూనియర్ కాలేజ్, సోమాజిగూడలోని విల్లా మేరీ గర్ల్స్ కాలేజ్, అమీర్‌పేటలోని నారాయణ జూనియర్ కాలేజ్, రూట్స్ జూనియర్ కాలేజ్.. మధురానగర్ పీఎస్ పరిధిలోని యూసు‌ఫ్‌గూడ చెక్‌పోస్ట్‌లోని మాస్టర్స్ జూనియర్ కాలేజ్, వెంగళరావునగర్‌లోని నలంద జూనియర్ కాలేజ్, అమీర్‌పేటలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజ్, మాస్టర్ మైండ్స్ జూనియర్ కాలేజ్, వెస్ట్ శ్రీనివాసనగర్ కాలనీలోని మెరిటో జూనియర్ కాలేజ్, ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజ్‌లలో పరీక్షలు జరగనున్నాయి. ఈ కేంద్రాల్లో ఫ్యాన్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. మరుగుదొడ్లను శుభ్రం చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పంజాగుట్ట ఏసీపీ ఎస్.మోహన్ కుమార్ తెలిపారు. ప్రతి కేంద్రం వద్ద పోలీస్ సిబ్బందిని నియమిస్తున్నట్లు వెల్లడించారు.

టీజీఈఆర్సీలో రాష్ట్ర సలహా కమిటీ సమావేశం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (టీజీఈఆర్సీ) రాష్ట్ర సలహా కమిటీ సమావేశం కల్యాణ్‌నగర్‌లోని విద్యుత్ నియంత్రణ భవన్‌లో టీజీఈఆర్సీ చైర్మన్ డా.జస్టిస్ డి.నాగార్జున్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో టీజీ ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, ట్రాన్స్‌కో జీఎండీ శ్రీనివాసరావు, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, స్టేట్ అడ్వైజరీ కమిటీ (ఎస్ఏసీ) సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ రంగంలో ఎదురవుతున్న సవాళ్లు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ, విద్యుత్ రంగ సంస్థల ఆర్థిక పటిష్టతతో పాటు పలు విధానపరమైన అంశాలపై ఎస్ఏసీ సభ్యులు సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు. స్టేట్ అడ్వైజరీ కమిటీలో పలు రంగాలకు చెందిన 17 మంది సభ్యులను నియమించారు. సమావేశంలో చైర్మన్ డా.జస్టిస్ డి.నాగార్జున్ మాట్లాడుతూ.. క్లీన్ ఎనర్జీ వైపు వెళ్లాల్సిన అవసరముందన్నారు.

అండర్ పాస్ నిర్మాణం జరిగేనా?

- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- ఆ దిశగా చర్యలు తీసుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

అమీర్‌పేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ నుంచి బాలానగర్ (నర్సాపూర్ కూడలి)ను కలిపేందుకు చేపట్టాల్సిన అండర్ పాస్ నిర్మాణానికి ఏ మాత్రం అడుగులు ముందుకు పడటం లేదు. గత ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టుతో పాటు ఫతేనగర్ బ్రిడ్జి విస్తరణ కోసం నిధులు సైతం మంజూరైనట్లు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ పనుల్లో ఎలాంటి కదలిక లేకుండా పోయింది. హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంస్థ(హెచ్ఆర్‌డీసీఎల్), రైల్వే శాఖ కలిసి సంయుక్తంగా నిర్మించనున్న ఈ కొత్త మార్గం పనులు 2021 జనవరిలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేసినప్పటికీ కొన్ని సాంకేతిక సమస్యలతో అది సాధ్యం కాలేదు. ఆ తరువాత అండర్ పాస్ నిర్మాణంతో పాటు ఫతేనగర్ ఫ్లైఓవర్ విస్తరణ కోసం రూ.105 కోట్లు కేటాయించినట్లు ప్రకటించారు. పనుల కోసం హెచ్ఆర్‌డీసీఎల్, రైల్వే అధికారులు సర్వే సైతం నిర్వహించారు. మొత్తం 2.34 కిలోమీటర్ల మార్గంలో 600 మీటర్ల మేర రైలు పట్టాల కిందుగా నగరంలోనే అతి పొడవైన అండర్ పాస్ నిర్మాణం జరగాల్సి ఉంది.

పూర్తయితే ఎన్నో ప్రయోజనాలు

సనత్‌నగర్ వైపు నుంచి బాలానగర్‌లోని నర్సాపూర్ కూడలి వరకు కొత్త మార్గాన్ని ప్రతిపాదించారు. సనత్‌నగర్ పారిశ్రామిక వాడ మీదుగా రైలు పట్టాల కిందుగా బాలానగర్ చేరుకునేలా కొత్త అండర్ పాస్ నిర్మాణాన్ని డిజైన్ చేశారు. గతంలో ఈ ప్రాజెక్ట్ వ్యయం రూ.68.30 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ప్రాజెక్ట్ వ్యయంలో సుమారు రూ.40 కోట్లను రైలు పట్టాల కిందుగా అండర్ పాస్ నిర్మించడం కోసం రైల్వేశాఖకు కేటాయించారనే ప్రచారం జరిగింది. వాస్తవానికి ఈ ప్రాజెక్ట్ ఆలోచనకు 33 ఏళ్ల కిందట బంగారు లక్ష్మణ్ రైల్వే శాఖ మంత్రిగా పనిచేసిన కాలంలోనే బీజం పడింది. సికింద్రాబాద్-ముంబై లైన్‌లో ఉన్న 7 రైలు


అండర్‌పాస్ నిర్మించాల్సిన సనత్‌నగర్‌లోని పారిశ్రామికవాడ ప్రాంతం

పట్టాల కిందుగా సనత్‌నగర్ బాలానగర్‌ను కలిపే అండర్ పాస్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఎర్రగడ్డ నుంచి బాలానగర్‌కు 10 నిమిషాల్లో, సనత్‌నగర్ నుంచి నర్సాపూర్ చౌరస్తాకు కేవలం 5 నిమిషాల్లోనే చేరుకోవచ్చు మరో వైపు జాతీయ రహదారిపై రద్దీ కూడా తగ్గుతుంది. ప్రతిపాదనలు సిద్ధమై, నిధులు సైతం మంజూరైన ఈ నిర్మాణం పూర్తయితే ఎన్నో ప్రయోజనాలుంటాయనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న హబీబా సుల్తానా తదితరులు

మధురానగర్‌లో ఇఫ్తార్ విందు

బోరబండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని బోరబండ డివిజన్ పరిధిలోని మధురానగర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రఫీక్ (బబ్లీ) తన నివాసంలో మంగళవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నగర నాయకురాలు హబీబా సుల్తానా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు చెట్టి దేవేందర్, ముత్యాల మహేష్, జావీద్, ఖాన్‌సాబ్, నజీమ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

బోరబండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నదని రహ్మత్‌నగర్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్థాయీ సంఘం సభ్యుడు సీఎన్ రెడ్డి అన్నారు. రహ్మత్‌నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని మహిళా సంఘాలతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 8న జరగనున్న మహిళా దినోత్సవం సందర్భంగా పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే భారీ బహిరంగ సభకు డివిజన్ నుంచి పెద్దఎత్తున మహిళలు తరలిరావాలని కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మహిళా సంఘాలతో కలిసి కేక్ కట్ చేశారు. జీహెచ్ఎంసీ డీపీఓ వెంకట కిషన్‌రావు, సీఓ వెంకటయ్య, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.


మహిళా సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

సీవరేజ్ పనులను వెంటనే ప్రారంభించండి

- అధికారులకు కార్పొరేటర్ సూచన

బేగంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): శ్యామ్‌లాల్ బిల్డింగ్, గురుమూర్తి లైన్ ప్రాంతాల్లో కార్పొరేటర్ టి. మహేశ్వరి మంగళవారం అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. గురుమూర్తి లైన్‌లో సంవత్సరం క్రితం సీవరేజ్ లైన్ ఏర్పాటు కోసం రూ.7 లక్షలు మంజూరు చేసినా పనులు ఎందుకు చేయలేదని అధికారులను ప్రశ్నించారు. అప్పట్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నిధులతో పనులకు శంకుస్థాపన చేశామని, ఈ పనులు పూర్తిచేస్తే మురుగు సమస్య తొలగిపోతుందన్నారు. వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సురేష్‌యాదవ్, టి.శ్రీహరి, నరేష్ పాల్గొన్నారు.


గురుమూర్తి లైన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి

ఖైరతాబాద్‌లో బీజేపీ నేతల సంబురాలు

ఖైరతాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్కా కొమరయ్య విజయం సాధించడంతో పాటు కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో నాలుగు రౌండ్ల అనంతరం పార్టీ అభ్యర్థి లీడ్‌లో ఉండటంతో ఖైరతాబాద్ బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఖైరతాబాద్ బీజేపీ జెండా వద్ద హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రేంసింగ్ రాథోడ్, పార్టీ నాయకులు మిఠాయిలు పంచి పెట్టారు. డివిజన్ అధ్యక్షుడు ఆదర్శ్ వంశీకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో దీపక్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తుందనడానికి ఈ ఫలితాలే నిదర్శనమన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అవినీతి, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలతో ప్రజలు విసిగిపోయారని, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు రావాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రేంరాజ్, రామ్మోహన్‌రావు, ఎన్‌డీ నగేష్, వీణామాధురి, వైద్యనాథ్, చంద్రబాబా, లాల్ హీరా తదితరులు పాల్గొన్నారు.


బాణసంచా కాల్చుతూ సంబురాలు చేసుకుంటున్న లంకల దీపక్‌రెడ్డి తదితరులు

సీఐడీ చీఫ్ సస్పెన్షన్‌తో టీడీపీకి సంబంధం లేదు

- టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి దశరథ్

షాపూర్‌నగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సోమవారం ఆంధ్ర రాష్ట్రంలో ఐపీఎస్ అధికారి, సీఐడీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసిన చర్య కేవలం పాలనా యంత్రాంగం తీసుకొన్న నిర్ణయం మాత్రమేనని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ అన్నారు. దీనిని ఆసరాగా చేసుకుని ప్రభుత్వాన్ని నిందించేలా కొందరు టీడీపీ చేసిందనడం ఎంతవరకు సమంజసమని విలేకరుల సమావేశంలో ఆయన మండిపడ్డారు. మంగళవారం షాపూర్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ.. కొందరు ఆ అధికారికి కులం కార్డు తగిలించి రాజకీయ లబ్ధికోసం చవకబారు ప్రకటనలతో పార్టీని అపఖ్యాతిపాలు చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా అధికారులను ఉపయోగించుకొని వారికి నచ్చని ప్రతిపక్ష నేతలు, అధికారులు, సామాన్య ప్రజలపై అక్రమ కేసులు పెట్టింది గుర్తులేదా అని ప్రశ్నించారు. అప్పటి అక్రమ కేసులపై టీడీపీ బాధ్యతాయుతంగా పోరాడిన విషయం ప్రజలందరికీ తెలుసన్నారు.


దశరథ్

రైలు ఢీకొని యువకుడి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టాలు దాటుతుండగా యువకుడిని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ సంఘటన అల్వాల్ రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ రైల్వేస్టేషన్ సమీపంలో యూపీ గోండా జిల్లా సింహపూర్‌కు చెందిన సచిన్ సుక్లా (25) మంగళవారం రైలు పట్టాలు దాటుతుండగా కాచిగూడ ప్యాసింజర్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే అతడు మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కాలేజీకి వెళ్లిన విద్యార్థిని అదృశ్యం

బౌద్ధనగర్, మార్చి4(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌గడ్డకు చెందిన పి.సైదయ్య కుమార్తె పి.నిక్షిత(21) గత నెల 24వ తేదీన ఉదయం 8 గంటలకు కాలేజీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు యువతి కోసం పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో కుమార్తె కనిపించటం లేదని తండ్రి సైదయ్య సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం

- వ్యక్తి మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

దుండిగల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్-5 వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా.. మరో ఇద్దరు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దుండిగల్ సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం ప్రాంతానికి చెందిన కార్తీక్(38), భార్య సింధు, మూడు సంవత్సరాల కుమారుడితో కలిసి నిజాంపేట్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. సొంత ఊరు ఖమ్మంకు రెండు రోజుల క్రితం వెళ్లాడు. నిజాంపేట్‌కు తన కారులో తిరిగి వస్తుండగా మంగళవారం ఉదయం 7 గంటల 40 నిమిషాల ప్రాంతంలో ఎగ్జిట్-5 వద్దకు రాగానే మేడ్చల్ నుంచి మల్లంపేటకు తన ముందు వెళుతున్న డీసీఎం వాహనాన్ని వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న కార్తీక్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. భార్య, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనే సమయంలో ఈ ప్రమాదం జరగడంతో బాధిత కుటుంబ సభ్యులు తీవ్రంగా రోదిస్తున్నారు.


ప్రమాదంలో ధ్వంసమైన కారు


పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బోరబండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బోరబండ డివిజన్ పరిధిలోని భరత్ నగర్‌లో రూ.23 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్థాయీ సంఘం సభ్యుడు ఎండీ బాబా ఫసియుద్దీన్ మంగళవారం ప్రారంభించారు. పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన కాంట్రాక్టర్‌కు సూచించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీపడేది లేదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు సయ్యద్ ఖయ్యూమ్, ఇమ్రాన్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో అభివాదం చేస్తున్న ఐరన్న, కుమారస్వామి, మోహన్ బైరాగి తదితరులు

తెలంగాణ ఉద్యమ కళాకారులను ఆదుకోవాలి

రాంనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోల్పోయిన తెలంగాణ ఉద్యమ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ కళాకారుల వేదిక నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కళాకారుల వేదిక రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కె.ఐరన్న, కన్వీనర్ ఎం.కుమారస్వామి, మోహన్ బైరాగి తదితరులు మాట్లాడారు. కళాకారుల సంక్షేమం కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని, 55 సంవత్సరాలు నిండిన కళాకారులకు ప్రతినెలా రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన కళాకారుడి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఇతర డిమాండ్లను సైతం నెరవేర్చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, పూలమ్మ, దేశ్‌పాండే, ప్రఫుల్ రాంరెడ్డి, శరత్, స్కైలాబ్, కూర వెంకటయ్య, సాయికిరణ్, రమ, శ్రావణి, రజిత తదితరులు పాల్గొన్నారు.


డిప్యూటీ లేబర్ కమిషనర్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

కార్మిక సంక్షేమ బోర్డు పథకాలను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించొద్దు

- డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు ఐఎఫ్‌టీయూ వినతి

రాంనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంక్షేమ బోర్డు పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వవద్దని, ఇది కార్మిక సంక్షేమానికి గొడ్డలిపెట్టు వంటిదని, దీనిని ఉపసంహరించుకోవాలని ఐఎఫ్‌టీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు కార్మికశాఖ డిప్యూటీ లేబర్ కమిషనర్ గంగాధర్‌కు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నేతలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పథకాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. డిప్యూటీ లేబర్ కమిషనర్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, త్వరలో వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి జి.అనురాధ, ఐఎఫ్‌టీయూ ఉపాధ్యక్షురాలు అరుణ, సహాయ కార్యదర్శి శోభ బాబు, నాయకులు సత్యనారాయణ, నర్సింహ, యాదన్న, బాల్‌రాజ్, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య

బర్కత్‌పుర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎం.చిమ్నా తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్ - కాచిగూడ రైల్వే స్టేషన్ల మధ్య 35 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని యువకుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి శరీరంపై నలుపు రంగు టీషర్ట్, అదే రంగు జీన్స్ ప్యాంటు ఉన్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చిమ్నా తెలిపారు.

ఎగ్జామ్ సెంటర్‌లలో పకడ్బందీ ఏర్పాట్లు

● నేటి నుంచే ఇంటర్ పరీక్షలు



పరీక్ష కేంద్రం వద్ద ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్సై రామకృష్ణ

తిరుమలగిరి మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను ఎస్సై రామకృష్ణ, తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆయా కేంద్రాలను పరిశీలించారు. బొల్లారంలోని సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని విధిష జూనియర్ కళాశాల, సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సీలింగ్ ఫ్యాన్లు, టేబుళ్లు, మంచి నీటి వసతి, టాయిలెట్ సౌకర్యాలను యజమాన్యాలు కల్పించడంపై సంతృప్తిని వ్యక్తం చేశారు. సెయింట్ జోసెఫ్ కళాశాల కేంద్రంలో 385 మంది విద్యార్థులు, విధిష కళాశాలలో 586 మంది, బొల్లారంలోని సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో 418 మంది పరీక్షకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం విధించిన 5 నిమిషాల వరకు కూడా కేంద్రాలకు విద్యార్థులకు లోపలికి వెళ్లేందుకు కూడా అనుమతి ఇస్తామని తెలిపారు. అలాగే ఈ కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు మూసివేయాలన్నారు. 144 సెక్షన్ ఉన్న నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో ఎవరూ ఉండకూడదని తెలిపారు.

పగటిపూట భారీ వాహనాలకు అనుమతి నిరాకరణ : ఏసీపీ శంకర్‌రాజు


మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు

తిరుమలగిరి మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రోజూ పదిహేను వందల నుంచి రెండు వేల వరకు కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయని ట్రాఫిక్ అధికంగా పెరుగుతున్న నేపథ్యంలో పగటిపూట భారీ వాహనాలు నగరంలోకి అనుమతించడం లేదని ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు తెలిపారు. మంగళవారం తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వాహనాలు తగిన సమయంలో ప్రవేశించరాదని సూచిక బోర్డులను పోలీస్ స్టేషన్ పరిధిలోని బొల్లారం, కేంద్రీయ విద్యాలయం తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేశామన్నారు. నగరంలో రద్దీ అధికంగా ఉన్న నేపథ్యంలో భారీ వాహనాలపై ప్రవేశానికి టైమింగ్స్‌ను నిర్ధారించామని తెలిపారు. ఒకవేళ అనుమతి లేకుండా లోపలికి ప్రవేశించి ట్రాఫిక్ జామ్‌కు కారణమయ్యే వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధు బాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఏసీపీ సైదయ్యకు అభినందనలు



మహంకాళి డివిజన్ నూతన ఏసీపీగా ఎస్. సైదయ్య ఇటీవల నియమితులయ్యారు. ఆయన్ను ఏఐఎంఐఎం రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు పాపడ్ అశోక్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. -(రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి)



అంబులెన్స్ డ్రైవర్‌తో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఎస్సై శ్రీధర్

రోగి లేకుండా సైరనా? చర్యలు తప్పవు

బౌద్ధనగర్, మార్చి4(ఆంధ్రజ్యోతి): అంబులెన్స్‌లో రోగి లేకుండా సైరన్‌లు ఉపయోగిస్తే తగిన చర్యలు తీసుకుంటామని చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాసులు డ్రైవర్లను హెచ్చరించారు. మంగళవారం చిలకలగూడ చౌరస్తాలో అంబులెన్స్‌ల మీద డ్రైవ్ నిర్వహించారు. పలు అంబులెన్స్‌లను తనిఖీ చేసి వాటి పత్రాలను పరిశీలించారు. రోగి ప్రాణపాయస్థితిలో ఉంటేనే సైరన్‌లను ఉపయోగించాలన్నారు. అలా కాకుండా సైరన్‌ను ఉపయోగిస్తే మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం డ్రైవర్లను మీద కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇష్టం వచ్చినట్లు సైరన్‌ను ఉపయోగించి వాహనాదారులకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. తనిఖీల్లో ఎస్సై శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.


రాజును సన్మానిస్తున్న బీజేపీ నేతలు

బదిలీపై వెళ్తున్న ఉద్యోగికి సన్మానం

బౌద్ధనగర్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్తున్న శానిటరీ జవాన్ కడారి రాజును బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్, నాయకులు పంపర యాదగిరి, బెజ్జంకి రాజేశ్, బచ్చు విజయ్, శ్రీనివాస్ తదితరులు సత్కరించారు. మంగళవారం ఉదయం ఈ కార్యక్రమం నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో బౌద్ధనగర్, సీతాఫల్‌మండి తదితర ప్రాంతాల్లో ఇరవై సంవత్సరాలుగా సేవలందించి అంబర్‌పేట్‌కు రాజు బదిలీ అయ్యాడు.


చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌ల సంఘం జేఏసీ ప్రతినిధులు

సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలి

బేగంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వేతనాల పెంపు సహా పలు సమస్యలపై అంగన్‌వాడీ టీచర్లు.. సర్పంచ్‌ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సర్పంచుల సంఘం జేఏసీ ప్రతినిధులు ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యలను కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. కాగా, మంగళవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణికి 401 అర్జీలు వచ్చాయి. చిన్నారెడ్డి, దివ్య అర్జీలను స్వీకరించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

నిద్రావస్థలో నిఘా నేత్రం

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద రెచ్చిపోతున్న పిక్ పాకెటర్స్

● ఫుట్‌పాత్, రద్దీ ప్రాంతాలే లక్ష్యం

● జనాల నుంచి వస్తువుల తస్కరణ

● చోరీ జరిగితే దొంగ చిక్కేనా?

నేరాల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు నిద్రావస్థలో ఉన్నాయి. వాటి నిర్వహణ, పర్యవేక్షణ ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో సికింద్రాబాద్ ప్రాంతంలో జేబు, సెల్‌ఫోన్ దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రద్దీగా ఉన్న బస్సులు, వృద్ధులు, రైల్వే ప్రయాణికులే లక్ష్యం చేసుకుని హ్యాండ్ బ్యాగులు, పాకెట్లు కత్తిరిస్తున్నారు. దీంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. బాధితులు ఎక్కువగా స్థానికేతరులు కావడంతో పోలీసులకు ఫిర్యాదులు చేయకుండానే తమ గమ్య స్థానాలకు పయనమవుతున్నట్లు తెలుస్తోంది.


రైల్వే స్టేషన్ సమీపంలో పని చేయని సీసీ కెమెరాలు





అడ్డగుట్ట, మార్చి 4 ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆవరణలో ఉన్న ఫుట్‌పాత్‌లు, చుట్టుపక్కల ఉన్న మోండా మార్కెట్, ఆల్ఫా హోటల్ క్లాక్ టవర్, రేతిఫైల్ బస్టాండ్ వంటి ముఖ్యమైన కూడళ్ల వద్ద సెల్‌ఫోన్ దొంగలు పేట్రేగిపోతున్నారు. సీసీ కెమెరాలు లేని చోట్ల దొంగతనాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా స్టేషన్ ఆవరణలో రాత్రి నిద్రిస్తున్న ప్రయాణికులతో కలిసి వారి జేబులో ఉన్న సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లిపోతున్నారు. ఇదే సమయంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారు. అయినా వారి కళ్లు గప్పి చోరీలకు తెగబడుతున్నారు. ఒకవేళ చోరీ జరిగిన ప్రయాణికులు రైలు సమయం అవుతుందని కారణంతో పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. పోలీస్ స్టేషన్ ఎక్కడ ఉందో కూడా తెలుసుకునేందుకు ఆసక్తిని చూపడం లేదు. దీంతో చోరులు హస్తలాఘవానికి పని చెబుతున్నారు.

ఈ బస్టాప్ అడ్డాగా..

రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న బస్టాప్‌లో దొంగలు చెలరేగిపోతున్నారు. ఉదయాన్నే వారు ఈప్రాంతంలో మాటు వేసి బస్సు ఎక్కుతున్న జనంలో అమాయకులను, వృద్ధులను, మహిళలను టార్గెట్ చేస్తున్నారు. వారి వస్తువులను చోరీ చేస్తున్నారు. ఒక వైపు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునఃనిర్మాణ పనులు జరుగుతుండగా.. ప్రయాణికులు వందల్లో ఫుట్‌పాత్‌లపై నిలబడుతున్నారు. దొరికిందే సందు అన్నట్లుగా వస్తువులను కాజేస్తున్నారు. అందులోనూ వృద్ధ మహిళల వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు ఎక్కువగా తస్కరిస్తున్నారు. సీసీ కెమెరాలు లేని చోట్ల దొంగలు చోరీలకు పాల్పడుతుండటం విశేషం. గురుద్వార్ ఆలయం ఎదురుగా ఉన్న బస్టాప్‌లో కొందరు దొంగలు బస్సు ఎక్కి రద్దీగా ఉండే బస్సులో పర్సులు, సెల్‌ఫోన్లు చోరీ చేసి వెనుక ఉన్న తన మనిషికి అప్పగించి క్లాక్ టవర్ వద్ద దిగిపోతున్నారు. ఇప్పటికైనా పిక్ పాకెటర్స్ ఆగడాలపై పోలీసులు నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

నిర్వహణ పట్టించుకోరు?

సికింద్రాబాద్ వాణిజ్య కేంద్రంగా పేరుంది. ఇక రైల్వే స్టేషన్‌లో గురించి ప్రత్యేకంగా చెప్పాల్సి ఇంకేముంది. రోజూ రెండు లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఐదేళ్ల క్రితం ప్రయాణికుల భద్రత, నేర నియంత్రణకు గాను మూడో నేత్రమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దీంతో చాలా వరకు ప్రయోజనం చేకూరుతుంది. ప్రస్తుతం ఇవి పని చేస్తున్నాయో తెలియడం లేదు. వాటి నిర్వహణ, పర్యవేక్షణ పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు

● ఎంఆర్‌పీఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజిత్


మాట్లాడుతున్న అజిత్ తదితరులు

బోయిన్‌పల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు హాల్ టిక్కెట్‌లు ఇవ్వకుండా వారి జీవితాలతో పాఠశాల యజమాన్యాలు చెలగాటం ఆడటం సరికాదని ఎంఆర్‌పీఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజిత్ కళ్యాణ్ విద్యాసంస్థలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం బోయిన్‌పల్లి బాపూజీనగర్ నల్లపోచమ్మ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని విద్యాసంస్థలు ధనార్జనే ధ్యేయంగా విద్యార్థులను వారి తల్లితండ్రులను మానసిక ఒత్తిడులకు గురిచేస్తూ బలవంత ఫీజులు వసూలు చేస్తున్నాయని, తన దృష్టికి వచ్చాయని తెలిపారు. ఇబ్బందులు పెట్టి ఫీజులు వసూలు చేస్తున్న ఆ సంస్థల పట్ల సంబంధిత విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే సమయంలో ఫీజులు కట్టాలంటూ హాల్ టిక్కెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టినట్లయితే ఆందోళను చేపడుతామని హెచ్చరించారు. రావాల్సిన ఫీజు బకాయిలు ఏమైనా ఉంటే పరీక్షలు ముగిసిన తర్వాత వసూలు చేసుకోవాలన్నారు. ఇదే అదునుగా తీవ్ర మానసిక క్షోభకు గురిచేసేలా వ్యవహరించడం సరికాదని హెచ్చరించారు. సమావేశంలో శ్రీకాంత్, రామారావు, దుబాయ్ అశోక్, బాబిందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు


సీతాఫల్‌మండి చౌరస్తాలో విజయోత్సవ వేడుకలో నాయకులు

బౌద్ధనగర్, మార్చి4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్కా కొమురయ్య విజయం సాధించగా మంగళవారం సాయంత్రం బీజేపీ నాయకులు విజయోత్సవ వేడుకలు జరిపారు. సీతాఫల్‌మండి చౌరస్తాలో నిర్వహించిన వేడుకల్లో బీజేపీ మహంకాళి, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు అందజేశారు. అనంతరం బాణసంచా కాల్చారు. ఈ గెలుపు రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు శుభసూచకమని తెలిపారు. వేడుకల్లో మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్, నాయకులు కనకట్ల హరి, పోచయ్యయాదవ్, అనిత, అనుషా, సరోజ, రాజేశ్వరి పాల్గొన్నారు.



మర్యాదపూర్వక కలయిక

జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డిని సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కవిత మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తార్నాకలోని క్యాంపు కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. కవిత ఇటీవల ఇంజినీర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

- తార్నాక, మార్చి4 (ఆంధ్రజ్యోతి)



ఘనంగా మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను తార్నాకలోని కందర్ డయాబెటిస్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. అనంతరం డాక్టర్. హరికుమార్ వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురు మహిళలను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కందర్ డయాబెటిస్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కె. దిలీప్ కుమార్, బీజేపీ నాయకులు వెంకటేశ్ గౌడ్, రాముమర్మ, డా. కేశవ్, వాసవి, డా. అనూష, గ్రీష్మ తదితరులు పాల్గొన్నారు.

● అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ సంఘ సేవాకర్త డా. లక్కరాజు నిర్మలను తెలంగాణ మాజీ స్పీకర్ మదుసూధనా చారి ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.


- తార్నాక, మార్చి4 (ఆంధ్రజ్యోతి)




విద్యుత్ కాంతుల్లో ఆలయం

నేటి నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

ఎర్రగడ్డ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని విజయలక్ష్మి దేవాలయంలో బుధవారం నుంచి 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 10వ తేదీతో ముగియనున్న ఈ వేడుకలకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చిన్న జీయర్ స్వామి మంగళ శాసనములతో ఉత్సవాలు నిర్వహిస్తున్నామని దేవాలయ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, కార్యదర్శి పి.జనార్దన్, కోశాధికారి ఎం.వి.రెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సహస్రనామ స్తోత్ర పారాయణం, విశ్వక్సేనారాధన, రక్షాబంధనం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. ప్రతీ సంవత్సరం మార్చిలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే విజయలక్ష్మి శ్రీనివాస కల్యాణ మహోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ ఏడాది మహోత్సవాన్ని 8న సాయంత్రం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 10న మహాపూర్ణాహుతి, 108 కలశాలతో క్షీరాభిషేకం, చక్రస్నానం నిర్వహిస్తారు.


గురుమూర్తి లైన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి

సీవరేజ్ పనులను వెంటనే ప్రారంభించండి : కార్పొరేటర్

బేగంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గురుమూర్తి లైన్‌లో సంవత్సరం క్రితం సీవరేజ్ లైన్ ఏర్పాటు కోసం రూ.7 లక్షలు మంజూరు చేసినా పనులు ఎందుకు? చేపట్టలేదని అధికారులను కార్పొరేటర్ టి. మహేశ్వరి ప్రశ్నించారు. శ్యామ్‌లాల్ బిల్డింగ్, గురుమూర్తి లైన్ ప్రాంతాల్లో మంగళవారం అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. అప్పట్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నిధులతో పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ఈ పనులు పూర్తిచేస్తే మురుగు సమస్య తొలగిపోతుందన్నారు. వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సురేష్‌యాదవ్, టి.శ్రీహరి, నరేష్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

అడ్డగుట్ట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులకు శిక్షణతోపాటు ఉద్యోగాలు కల్పిస్తామని ఆప్సా టెక్ మహీంద్ర ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. మెడికల్ కోడింగ్ బిల్లింగ్‌లో శిక్షణ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. బీఎస్సీ, ఎంఎస్సీ బీఫార్మా, ఎంఫార్మా, బీకాం, ఎంకాం నిరుద్యోగులకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు 100 రోజుల శిక్షణ ఉంటుందన్నారు. ఈనెల 15న హబ్సిగూడలోని ఆప్సా టెక్ మహీంద్ర ఫౌండేషన్ సెంటర్‌లో బ్యాచ్ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని తెలిపారు. వివరాలకు 91549-90132 , 91549-90130, 91549-90130 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.


ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవంలో ఎంఈఓ మదన్‌మోహన్ విద్యార్థినులు

కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన

అడ్డగుట్ట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు చదువుతున్నారని మారేడుపల్లి మండల విద్యాశాఖ అధికారి(ఎంఈఓ) మదన్‌మోహన్ అన్నారు. మంగళవారం మారేడుపల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు విద్యలో సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉన్నారన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల స్టూడెంట్స్ కూడా మంచిగా చదువుకుంటున్నారన్నారు. అన్ని రకాల మౌలిక సౌకర్యాలు ఉన్నాయని, అనుభవం గల ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య బోధిస్తున్నారన్నారు. స్కూలు ప్రిన్సిపాల్ నాగలీలావతి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, అరుణ, మంగమ్మ, సౌజన్య, విజయలక్ష్మి, మంజుల, జాస్మైనులతో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి


సచిన్ (ఫైల్)

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టాలు దాటుతుండగా యువకుడిని రైలు ఢీకొనగా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ సంఘటన అల్వాల్ రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం... అల్వాల్ రైల్వేస్టేషన్ సమీపంలో యూపీ గోండా జిల్లా సింహాపూర్‌కు చెందిన సచిన్ సుక్లా (25) మంగళవారం రైలు పట్టాలు దాటుతుండగా కాచిగూడ ప్యాసింజర్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలతో ఘటనాస్థలంలోనే చనిపోయాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఇక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కాలేజీకి వెళ్లిన యువతి అదృశ్యం


నిక్షిత (ఫైల్)

బౌద్ధనగర్, మార్చి4(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మైలార్‌గడ్డకు చెందిన పి.సైదయ్య కుమార్తె పి.నిక్షిత(21). గతనెల 24వ తేదీ ఉదయం 8 గంటలకు కాలేజీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పేసి వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు, బంధువులు.. యువతి కోసం పలు చోట్ల వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో కుమార్తె కనిపించటం లేదని తండ్రి సైదయ్య సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

మంటలు అంటుకొని వృద్ధురాలి మృతి

మల్కాజ్‌గిరి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పూజ గదిలోని దీపం కిందపడి దుస్తులకు అంటుకున్న మంటలు మంచంపై ఉన్న వృద్ధురాలికి అంటుకోవడంతో ఆమె మృతి చెందింది. మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ విషాద ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎన్ఎండీసీ కాలనీ గౌరీ అపార్టుమెంట్‌లో హీరాదేవి (77) కూతురు సువర్ణలత వద్ద ఉంటోంది. సోమవారం కుమారుడు అశ్విన్ (19)తో కలిసి సువర్ణలత మల్కాజిగిరి కోర్టుకు వెళ్లారు. కొద్ది సేపటి తర్వాత అశ్విన్ ఇంటికి వచ్చి చూడగా గది అంతా పొగతో నిండిపోయి ఉంది. అమ్మమ్మ కాలిన గాయాలతో కిందపడి ఉంది. వెంటనే తల్లికి సమాచారం ఇవ్వగా ఇంటికి చేరుకున్న సువర్ణలత ...హీరాదేవిని చికిత్స నిమిత్తం రైల్వే ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. పూజ గదిలోని దీపం అంటుకుని కాలిన గాయాలతో హీరాదేవి మరణించిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యమ కళాకారులను ఆదుకోవాలి

రాంనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోల్పోయిన తెలంగాణ ఉద్యమ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ కళాకారుల వేదిక నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కళాకారుల వేదిక రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కె.ఐరన్న, కన్వీనర్ ఎం.కుమారస్వామి, మోహన్ బైరాగి తదితరులు మాట్లాడారు. కళాకారుల సంక్షేమం కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని, 55 సంవత్సరాలు నిండిన కళాకారులకు ప్రతినెలా రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన కళాకారుడి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఇతర డిమాండ్లను సైతం నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, పూలమ్మ, దేశ్‌పాండే, ప్రఫుల్ రాంరెడ్డి, శరత్, స్కైలాబ్, కూర వెంకటయ్య, సాయికిరణ్, రమ, శ్రావణి, రజిత పాల్గొన్నారు.